ఆహ్లాదం కరువు

అది అందమైన కాలనీ.. ఎటు చూసినా కోట్లు విలువచేసే ఖరీదైన భవనాలు. ఒక వైపు కూతవేటు దూరంలో రైల్వేస్టేషన్. చెంతనే జాతీయ రహదారి. అంతకు మించి కాలనీలో విస్తారమైన రహదారులు ఉన్నాయి. దీంతో కాలనీలో నివాసం ఉండడానికి అటు వ్యాపారులు ఇటు ఉద్యోగులు ఎక్కువగా ఆసక్తి చూపుతుంటారు. అంత విలువైన కాలనీలో కనీసం కాసేపు సేద తీరడానికి కూడా అవకాశం లేకుండా పోతుంది.

– కూర్మన్నపాలెం

- అందమైన కాలనీలో కానరాని పార్కు
- 2.25 ఎకరాలు ఉన్నా పట్టని వైనం
- పార్కు అభివృద్ధి చేయాలని కాలనీ వాసుల వేడుకోలు


పార్కులోకి చేరిన మురుగునీరు



కాలనీ ముఖద్వారం


విశాలమైన గ్రీన్‌లాండ్ కాలనీ

కాలనీ వాసులు సంఘంగా ఏర్పడి తమకు తాముగా పార్కుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటామని ముందుకు వస్తున్నారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే కూర్మన్నపాలెం నడిబొడ్డున రాజీవ్‌నగర్‌కు సమీపంలోని గ్రీన్‌లాండ్.

ఇదీ విషయం : 2002 సంవత్సరంలో విశాఖ నగరాభివృద్ధి సంస్థ సువిశాలమైన ప్రాంతంలో వుడా ఫేజ్ 6 పేరుతో ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టింది. అప్పట్లో అనేకమంది కొనుగోలు చేసుకొని అంచెలంచెలుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కాలనీని మరింత అభివృద్ధి పరచుకున్నారు. ప్రజలకు ఆహ్లాదం.. వినోదం అందించడంతో పాటు సాయంత్రం వేళ కాసేపు సేద తీర్చుకొని పిల్లా పాపలతో గడపడానికి పార్కు నిర్మించాలని యోచించింది. అందుకు 2.25 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అప్పట్లో మొక్కుబడిగా రెండు మూడు బల్లలు వేసేసి ఆ తర్వాత గాలికి వదిలేశారు. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ పార్కులో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు వెలసిపోయాయి. ఆ తర్వాత కొంతకాలానికి అధికారులు అందులోనే వాటర్ ట్యాంకులు కట్టి మంచినీటి సరఫరా ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం అక్కడ పార్కు రూపం కనబడకుండా పోయింది.

పందులు, కుక్కల తిష్ట

పార్కు పరిసరాలు అధ్వానంగా ఉండడంతో పందులు, కుక్కలు తిష్ట వేస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల కాలంలో పార్కు స్థలం కొంత ఆక్రమించి నిర్మాణం కూడా చేసేశారు. అంతటితో ఆగిపోకుండా వాటర్ ట్యాంకు కింద షెడ్డు వేసి కుక్కలను పెంచడం కూడా ప్రారంభించారు. దీంతో పార్కులో ఆహ్లాదం మాట అటుంచి ఆ కుక్కలు ఎక్కడ వచ్చి మీద పడతయోమన్న భయం అందరినీ వెంటాడుతోంది. దీంతో పార్కు వైపు కన్నెత్తి చూడాలంటే అక్కడి వారు హడలి పోతున్నారు.

500 కుటుంబాల నివాసం

ప్రస్తుతం ఫేజ్–6 కాలనీలో సుమారు 500 కుటుంబాల వరకు నివసిస్తున్నాయి. వారంతా సాయంత్రం వేళ పార్కు ఉన్నా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. అధికారులు పట్టించుకోక పోయినా కాలనీ పెద్దలు జోక్యం చేసుకొని తలో కొంత వేసుకొని కళావేదిక నిర్మించుకున్నారు. వేసిన కుర్చీలు విరిగి పోవడం తుప్పలు ఏపుగా పెరిగి పోవడం, పందులు, కుక్కల సంచారం ఎక్కువగా ఉండడంతో ప్రజలు పార్కు ఉందన్న సంగతే మరిచి పోతున్నారు.

అందరికీ అనువైన ప్రాంతం

ప్రధాన రహదారికి సమీపంలో పార్కుకు కేటాయించిన స్థలం ఉంది. దీంతో పార్కు అభివృద్ధి చేస్తే కాలనీ వాసులతో పాటు అటుగా వెళ్లిన ప్రతి ఒక్కరూ పార్కులోకి వెళ్లి కాసేపు సేద దీరడానికి వీలుంటుంది. అధికారులు, పాలకులు జోక్యం చేసుకొని పార్కులోని ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పరచాలని కోరుతున్నారు. కనీసం పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి పందులు, కుక్కలు రాకుండా నిరోధించాలని ప్రాధేయపడుతున్నారు. తాజాగా అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశామని కాలనీవాసులు తెలిపారు.

పార్కుకు వెళ్లాలంటే భయం



కాలనీ అభివృద్ధి చెందుతున్నా పార్కును ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం పార్కుకు వెళ్లాలంటే భయం వేస్తుంది. అధికారులు ముందుకు వస్తే పార్కును అన్నిరకాలుగా అభివృద్ధి పరచడానికి మేము కూడా సహకరిస్తాం.

– జి.మల్లికార్జునరావు, కాలనీవాసి

వినతులు బుట్టదాఖలు



పార్కు అభివృద్ధి చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినాపట్టించుకోవడంలేదు.కాలనీలో నివాసమున్నవారు అంతా కలసికట్టుగా ఉంటూ అన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. పార్కు అభివృద్ధి విషయంలో కలసికట్టుగా పోరాటం చేస్తున్నా ఫలితం దక్కడంలేదు.

– గుల్లకుమార్, కాలనీ ప్రతినిధి

పార్కు అభివృద్ధి చేయాలి



గ్రీన్‌లాండ్ కాలనీ పార్కు అభివృద్ధి చేస్తే కూర్మన్నపాలెం ప్రాంతంలో ఉన్న ప్రజలందరికీ ఉపయుక్తంగా ఉంటుంది. విశాలమైన స్థలం కావడంతో పిల్లలు ఆడుకోవడానికి.. పెద్దలు కాలక్షేపం చేయడానికి అవకాశం ఉంటుంది. అధికారులు, పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.

– జి.దేశినాయుడు, వడ్లపూడి

ఆ స్థలాలు 40 ఏళ్ల కిందట కొన్నాం


మాట్లాడుతున్న స్థలాల కొనుగోలు దారులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం సర్వేనెంబర్ 27లో 40 ఏళ్ల కిందట తాము ప్లాట్లు కొనుగోలు చేశామని వాటి యజమానులు తెలిపారు. అప్పట్లో ఆ భూమి ప్రభుత్వానిది అని తెలియదని వారు పేర్కొన్నారు. తాము కొనుగోలు చేసిన 20 ఏళ్ల తర్వాత అధికారులు ఆ భూమి ప్రభుత్వానిదని వెల్లడించారని చెప్పారు. రాజీవ్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు ప్లాటు యజమానులు మాట్లాడారు. నాటి నుంచి ప్లాట్లు అప్పగించాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు మాతృశ్రీ లేఅవుట్‌లో కొనుగోలు చేసిన స్థలాను తమకు అప్పజెప్పాలని వారు కోరారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో బైక్ చోరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–11లో క్వార్టర్ బయట పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. సెక్టార్–11లోని 402 డి క్వార్టర్‌లో నివసిస్తున్న అనుపోజు మణికంత ఈనెల 2న బీ షిఫ్ట్ విధులు ముగించుకుని ఇంటికి వచ్చారు. క్వార్టర్ ముందు బైక్ పార్క్‌చేశారు. ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. అంతా వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్వీనగర్ ఫీడర్లలో విద్యుత్ తీగల నిర్వహణ పనులను బుధవారం చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్వీనగర్, కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి మేలు


తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత తదితరులు

పెదగంట్యాడ: ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పల్లిపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జాలరిపల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల అవశ్యకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని, తద్వార బిడ్డకు రోగ నిరోధక శక్తి అందుతుందన్నారు. ప్యాకెట్ పాలు పట్టిస్తే వచ్చే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో గంగవరం, పెదపల్లిపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. దుర్గమ్మ, పి. శాంతి, పి .దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం తీరుపై జేసీఎల్ అసంతృప్తి

అగనంపూడి: విశాఖ ఉక్కు యాజమాన్యం తీరుపై జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అసంతృప్తి వ్యక్తం చేసిందని సీతిన లక్ష్మి తెలిపారు. అగనంపూడికి చెందిన తన భర్త సీతిన అచ్యుతరావు ప్రమాదవశాత్తు తొమ్మిదేళ్ల కిందట మృతి చెందితే యాజమాన్యం పరిహారం ఎగ్గొట్టిందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామఅప్పారావు జేసీఎల్ దృష్టికి తీసుకువెళ్లడంతో పరిహారం చెల్లించాలని ఆదేశించారన్నారు. పక్షం రోజుల్లో చెల్లించని పక్షంలో 50 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో యాజమాన్యం 15 రోజులు గడువు కావాలని కోరిందని.. ఆగడువు కూడా దాటడంతో గతనెల 31న పరిహారం మొత్తం చెల్లించాల్సిందేనని యాజమాన్యాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని బాధితురాలు సీతిన లక్ష్మి మంగళవారం తెలిపారు.

ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో డ్రైవర్లకు నష్టం


ధర్నాలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

సీతంపేట : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చేసిన ప్రకటన ఆటో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం గురుద్వార కూడలిలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో, వ్యాన్, జీపు, కారు డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరలు, విడిభాగాల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో రోజంతా ఆటో నడిపినా పూట గడవడం కష్టంగా ఉందన్నారు. దీనికితోడు ఉబర్, ఓలా, రాపిడోతో ఉపాధి కోల్పోతున్నామని వాపోయారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

28 నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఎఫ్‌డీపీ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వారం రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నామని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఎఫ్‌డీపీ నిర్వహించనున్నామని వీసీ పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ సిస్టం ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో దీనిని నిర్వహిస్తామని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో బోధనా సిబ్బంది, పరిశోధకులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనంజయరావు, కార్యక్రమాల కన్వీనర్ కె.వెంకటరావు పాల్గొన్నారు.

గుంతలతో అవస్థలు


హౌసింగ్‌బోర్డు పార్కు ఎదురుగా ప్రధాన రహదారిపై గుంత


హౌసింగ్‌బోర్డు పార్కు వెనుక రోడ్డు మధ్యలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన రహదారిలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. కోట్లు కుమ్మరించి నూతనంగా ఆధునికీకరణ చేస్తున్న పార్కు ఎదురుగా ప్రధాన రహదారిలో పెద్ద గుంత ఏర్పడినా అధికారులకు కానరాకపోవడం విశేషం.

ఇది ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిత్యం ఇక్కడకి వస్తున్న అధికారులకు పార్కు ఎదురుగా ఉన్న పెద్ద గుంత మాత్రం కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. అలాగే పార్కు వెనుక ప్రధాన రహదారిలో ఇదే పరిస్థితి నెలకుంది. వాహనదారులు జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి ఉంది. అధికారులు స్పందించి రహదారిలో గుంతలు పూడ్చించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ


కంప్యూటర్లు అందించిన బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఐడీబీఐ బ్యాంక్ సామాజిక సేవలో భాగంగా దాస్, ఏజీఎం మౌషమి జైన్, గాజువాక మేనేజర్ సూరిశెట్టి రామశంకర్ సమకూర్చిన రూ. 2 లక్షలు విలువ చేసే కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలను మంగళవారం జీవీఎంసీ 65 వార్డు పరిధి భానోజీ కాలనీ, బాపూజీ కాలనీ, సంజీవ కాలనీ ఎంపీపీ పాఠశాలలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, హెచ్‌ఎం వి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ వారోత్సవాలు ప్రారంభం


గాజువాక ఏసీపీ శ్రీనివాసరావుకు రాఖీకట్టి సత్కరిస్తున్న రామకోటి, మాధురి


అగనంపూడిలో రాఖీ కడుతున్న విశాఖ బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే శివలీల

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు రక్షా బంధన్ వారోత్సవాల సందర్భంగా ప్రముఖులకు రాఖీలు కట్టారు. సౌత్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వై.శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జి బీకే రామకోటి, బ్రహ్మకుమారీ మాధురి రాఖీ కట్టి రక్షా బంధన్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోదర భావానికి పవిత్ర బంధంగా భావించే రక్షా బంధన్‌కు హైందవ సమాజంలో విశిష్టమైన ప్రాధాన్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కసిపల్లి శ్రీనివాసరావు, కొరాయి జగదీష్ పాల్గొన్నారు.

- అగనంపూడి జూబిలీహిల్స్ కాలనీలో సంస్థ విశాఖ ప్రతినిధి బీకే శివలీల, అగనంపూడి ప్రతినిధి భవాని మహిళా సంఘాల ప్రతినిధులకు రాఖీలు కట్టి రక్షా బంధన్ ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో గొల్లవిల్లి కనక భవాని, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

4 వేల మంది పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు


కార్యక్రమంలో పాల్గొన్న సీపీ డాక్టర్ బాగ్చీ, డాక్టర్ వాణి తదితరులు


మహిళా కానిస్టేబుల్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సుమారు 4 వేల మంది పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు 'వార్షిక పోలీసు ఆరోగ్య పరీక్ష 2.0' కార్యక్రమం మంగళవారం కేజీహెచ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ప్రతి రోజూ సుమారు 120 నుండి 150 మంది పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగించనున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణరావు, కేజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణన్, డాక్టర్ యు. శ్రీహరి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1, గ్రేడ్–2 పాల్గొన్నారు.

సకాలంలో ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి


శిక్షణలో పాల్గొన్న వారితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: త్వరలో జరగనున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కోసం హౌస్ హోల్డ్ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా సర్వే చేయాలన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ ఈ సర్వేకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ


సముద్రపు నాచు ఉత్పత్తుల గురించి మత్స్యకారులకు వివరిస్తున్న అధికారులు

మహారాణిపేట: సముద్రపు నాచు పెంపకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార యువతీ, యువకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. బీచ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ (సిఫ్ నెట్) కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. నాచు పెంపకానికి అనువైన ప్రాంతాల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. సముద్రపు నాచులో అనేక రకాలు ఉన్నాయని, ట్యూబ్, రాఫ్ట్ పద్ధతిలో నాచు పెంపకం, సముద్రపు నాచు ఎండబెట్టడం వంటి వాటిలో శిక్షణ ఇవ్వడమే కాకుండా మార్కెటింగ్‌పై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. దీనిపై మత్స్యకార యువతకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. సీఫ్‌నెట్ ఇన్‌చార్జి డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ సముద్రపు నాచుతో తయారు చేసే పలు ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్, డిప్యూటీ డైరెక్టర్ హెచ్.బిషోయ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ (ఎన్ఐఎఫ్‌పీహెచ్ఏటీటీ) డి.డి. డాక్టర్ మీనా కోటేశ్వరరావు, డాక్టర్ రమ్య, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, ఎఫ్‌డీవో ఆషాజ్యోతి, డీసీఎం కృష్ణ, గరికిన రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమసమాజం సేవలు మహోన్నతం


పాల్గొన్న కుష్టు వ్యాధిగ్రస్తులు

అల్లిపురం: ప్రేమ సమాజం కుష్టు శరణాలయ 71వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ ఎస్.ఎస్.రాజు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమసమాజం చేపడుతున్న సేవలన్నింటి కంటే కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి వారికి సేవలందించడం అన్నింటికంటే మహోన్నతమైనదని తెలిపారు. సభాధ్యక్షుడు కేశప్రగడ నరిసింహమూర్తి మాట్లాడుతూ ప్రేమ సమాజం 1955 నుంచి కుష్టు వ్యాధితో బాధపడుతున్న అనేక మంది రోగులను అక్కున చేర్చుకుని వారికి ఆశ్రయం కల్పిస్తూ, సపర్యలు చేస్తుందన్నారు. 1956లో చెవిడి రాణి ప్రేమసమాజం చేస్తున్న సేవలను గుర్తించి ఏవీఎన్ కళాశాల దరి స్థలాన్ని ఉచితంగా అందించారని తెలిపారు. 200 మంది రోగులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పుడు పది మంది మాత్రమే మిగిలారన్నారు. మిగిలివాన వారు ప్రేమసమాజం సేవల వల్ల కోలుకుని ఇళ్లకు వెళ్లిపోవడం గర్వకారణం అన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి అతిథులు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి. మోహన్ రావు, సంయుక్త కార్యదర్శి పి.లక్ష్మీగుప్తా, లంకాడ వెంకట్రావు, చోడవరం శాఖ కార్యదర్శి సరగడం సత్యనారాయణ, ఆశ్రమవాసులు, బాలబాలికలు పాల్గొన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం కోసమే సీవీ రచనలు


మాట్లాడుతున్న ఆచార్య కేఎస్ చలం

సీతంపేట : సమతా సాహితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం ప్రముఖ రచయిత చిత్తజల్లు వరహాలరావు (సీవీ) సాహిత్యంపై పరామర్శ సభ నిర్వహించారు. రచయిత డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం సీవీ రచనలు సాగించారన్నారు. డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సీవీ రచనల్లోని సామాజిక విషయాలపై ప్రసంగించారు. డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ సీవీ రచనల ప్రాసంగిత నేటికీ అవసరమన్నారు. డాక్టర్ బండి సత్యనారాయణ మాట్లాడుతూ సీవీ సాహిత్యం మీద విస్తృత ప్రచారం, పరిశీలన అవసరమన్నారు. కార్యక్రమంలో రచయితలు ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, వేమన, మహేష్, చిన్నారావు పాల్గొన్నారు.

అన్నప్రసాదం నాణ్యతలో రాజీపడొద్దు

సింహాచలం: సింహగిరిపై నిత్యాన్నదాన పథకంలో భక్తులకు అందించే అన్నప్రసాదం నాణ్యతగా ఉండాలని, అందులో ఎలాంటి రాజీపడొద్దని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నప్రసాద విభాగం అధికారులకు సూచించారు. అన్నప్రసాద భవనంలో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. భక్తులకు వడ్డించే అన్నంతో పాటు సాంబారు, కూర, మజ్జిగ రుచులను పరిశీలించారు. అన్నప్రసాదం నాణ్యత ఎలా ఉందో.. భక్తులను అడిగి తెలుసుకున్నారు. మొదటి పంక్తి నుంచి చివరి పంక్తి వరకు భక్తులకు ఒకే రకమైన నాణ్యతతో ఉన్న అన్నప్రసాదాన్ని అందించాలని సూచించారు.

ఘనంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ఏకాదశి తిరువీధి వైభవంగా జరిగింది. ఆలయంలో కొలువుదీరిన మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం బేడామండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. పారాయణాలు పఠించారు. విశేషంగా హారతి అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.